క్రీడా ప్రాంగణంలోని మట్టి కుప్పలు తొలగింపు

దిర్శించర్ల క్రీడా ప్రాంగణంలోని మట్టి కుప్పలను డోజర్‌తో తొలగిస్తున్న అధికారులు

నేరేడుచర్ల, మే 19: గ్రామాల్లో క్రీడాకారులను తీర్చిదిద్దడం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలను అధికారులు పట్టించుకోకపోవడంతో అపరిశుభ్రంగా, నిరుపయోగంగా మారాయి. ఈ విషయమై ఇటీవల నమస్తే తెలంగాణ దినపత్రికలో 'అలంకారప్రాయంగా క్రీడా ప్రాంగణాలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు మండల పరిధి దిర్శించర్ల గ్రామంలోని క్రీడా ప్రాంగణంలో పోసిన మట్టి కుప్పలను సోమవారం డోజర్‌తో తొలగించారు. చిల్లేపల్లి క్రీడా ప్రాంగణంలో గుడారం వేసుకొని బాతులను పెంచుతుండగా వాటిని తొలగించారు.

ప్రమాదకరంగా మలుపు

హుజూర్‌నగర్-వేపలసింగారం రోడ్డులో ప్రమాదకర మలుపు

హుజూర్‌నగర్ రూరల్, మే 19: హుజూర్‌నగర్ నుంచి వేపలసింగారం గ్రామానికి వెళ్లే రోడ్డులో ఎఫ్‌సీఐ గోడౌన్ సమీపంలో మూల మలుపు ప్రమాదకరంగా ఉంది. ఈ మలుపు వద్దే విద్యుత్ స్తంభం, కల్వర్టు ఉన్నాయి. కల్వర్టు కనిపించకుండా చెట్లు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక అక్కడ తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ మలుపు వద్ద అధికారులు కనీసం హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

సూర్యాపేటలో టయోటా షోరూమ్ ప్రారంభం

టయోటా షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేట టౌన్, మే 19: జిల్లా కేంద్రం సూర్యాపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన కాకతీయ టయోటా కారు షోరూమ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కె.నరసింహ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో కాకతీయ టయోటా షోరూమ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం షోరూమ్ నిర్వాహకులు మాట్లాడుతూ టయోటాకు సంబంధించిన అన్ని రకాల కార్లు సరసమైన ధరలో మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా వివిధ ఫైనాన్స్ కంపెనీల ద్వారా అతి తక్కువ ఈఎంఐలో కొనుగోలు చేయవచ్చని తెలిపారు కార్యక్రమంలో రూరల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఎస్ఐ ఆంజనేయులు, టయోటా షోరూం నిర్వాహకులు, సిబ్బంది, వివిధ ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ నిల్వలు, రవాణాపై కలెక్టర్‌కు ఫిర్యాదు

నేరేడుచర్ల, మే 19: మండలంలో ఇసుక అక్రమ నిల్వలు, రవాణాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నేరేడుచర్ల పట్టణానికి చెందిన గుండ్ర శ్రీనివాస్‌రెడ్డి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని దాచారం, సోమారం, చిల్లేపల్లి గ్రామాల నుంచి నిత్యం వందల ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని, నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని ఓ వెంచర్‌లో పెద్ద మొత్తంలో ఇసుక నిల్వలు ఉన్నాయని, దీనిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని నేరేడుచర్ల తాసీల్దార్, ఎస్ఐకి ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని, నిర్లక్ష్యం వహించిన అధికారులపైన చర్యలు తీసుకోవడంతో పాటు ఇసుక అక్రమ రవాణను అరికట్టాలని వినతి పత్రంలో కోరారు.

'ఎన్నికల హామీలను అమలు చేయాలి'

● గొర్రెల మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్

సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్

సూర్యాపేట టౌన్, మే 19: గొల్ల కురుమలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ గొర్రెల మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడత రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని చేతివృత్తిదారుల భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు గొల్ల కురుమలకు గొర్రెలు కొనుగోలు చేయడానికి ఒక్కరికి రూ.2 లక్షల నగదు బదిలీ చేస్తామని చెప్పిందని, పశుసంవర్ధక శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని, గొర్రెలు, మేకలకు పశువుల ఆసుపత్రిలో అన్ని రకాల రోగాలకు వ్యాక్సిన్లు, నట్టల నివారణ మందులు అందుబాటులో ఉంచుతామని చెప్పిందని గుర్తు చేశారు. అదేవిధంగా ప్రమాదవశాత్తు చనిపోయిన గొర్రెలకు ఎక్స్‌గ్రేషియా ఇస్తామని చెప్పి ఇంతవరకు ఏ ఒక్క హామీని అమలు చేయలేదని పేర్కొన్నారు. గొల్ల కురుమలు ఐక్యంగా ప్రభుత్వంపై ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కడం లింగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వీరబోయిన రవి, వజ్జ వినయ్, కంచుగట్ల శ్రీనివాస్, రాజుల నాగరాజు, గుండాల లింగయ్య, వీరబోయిన సైదులు, చిట్టింగి యాదగిరి, కుక్కల సాంబయ్య, ఎం.సైదులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నాగారం, మే 19: మండల పరిధిలోని నాగారం బంగ్లా గ్రామ శివారులో సూర్యాపేట-జనగాం జాతీయ రహదారి 365బీపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్.ఎస్ మండలం ఇస్తాళాపురం గ్రామానికి చెందిన మున్న ప్రవీణ్ ద్విచక్ర వాహనంపై తిరుమలగిరి వైపు వెళ్తున్నాడు. నాగారం బంగ్లా గ్రామ శివారులోకి రాగానే ద్విచక్ర వాహనం అదుపుతప్పి ముందున్న లారీని ఢీకొట్టడంతో కంటికి బలమైన గాయమైంది. స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి ప్రవీణ్‌ను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

● సీఐ చరమంద రాజు

స్టాక్ రిజిస్టర్ తనిఖీ చేస్తున్న సీఐ చరమంద రాజు

గరిడేపల్లి, మే 19: నకిలీ విత్తనాల విక్రయంపై కఠిన చర్యలు తీసుకుంటామని హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు హెచ్చరించారు. మండల పరిధి గడ్డిపల్లి గ్రామంలోని వరి విత్తన తయారీ కేంద్రాల్లో పోలీస్ సిబ్బంది, వ్యవసాయాధికారులతో కలిసి సీఐ సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వానకాలం సాగు సీజన్ ప్రారంభానికి ముందే విత్తన కేంద్రాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విత్తన తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. త్వరలో తనిఖీలు మరింత విస్తృతం చేయనున్నట్లు సీఐ వెల్లడించారు. వరి విత్తనాలకు వ్యవసాయాధికారుల సర్టిఫికేషన్ లేకపోతే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విత్తనాల స్టాక్, లాట్‌లు, స్టాక్ రిజిస్టర్లు, లైసెన్సులు పరిశీలించారు. తనిఖీల్లో గరిడేపల్లి మండల వ్యవసాయాధికారి ప్రీతమ్‌కుమార్, ఎస్ఐ చలికంటి నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్


ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, మే 19: ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును జిల్లా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ సమస్య పరిష్కారం చేయలేని పరిస్థితిలో ఫిర్యాదుదారులకు కచ్చితమైన సమాధానం చెప్పాలని అధికారులకు సూచించారు. అప్పుడే వారు కార్యాలయాల చుట్టూ తిరిగి సమయం వృథా చేసుకోరని చెప్పారు. ప్రజావాణిలో మొత్తం 63 దరఖాస్తులు రాగా అందులో అత్యధికంగా 27 రెవెన్యూ సంబంధిత సమస్యలపై వచ్చాయని వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఆర్‌డీఓ అప్పారావు, డీఐఈఓ భానునాయక్, డీఈఓ అశోక్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం, సీపీఓ కిషన్, సంక్షేమ అధికారులు శంకర్, దయానందరాణి, శ్రీనివాస్‌నాయక్, జగదీశ్వర్‌రెడ్డి, ఏఓ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం

● కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

నారాయణపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

చిలుకూరు, మే 19: కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో డబుల్ రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని నారాయణపురం నుంచి బాలాజీనగర్ వరకు 10 కిలోమీటర్ల మేర రూ.20 కోట్లతో చేపట్టనున్న ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు కీత వెంకన్న, యడవల్లి పుల్లారావు, పింద్రాతి హనుమంతురావు, కొండా సైదయ్య, కొండా ప్రభాకర్, మండవ శైలజామధు, మండవ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నేత పుచ్చలపల్లి సుందరయ్య

● సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి

సూర్యాపేట టౌన్: సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాగార్జున్‌రెడ్డి, నాయకులు

కోదాడ/నేరేడుచర్ల/తిరుమలగిరి/సూర్యాపేట టౌన్, మే 19 : నేటితరం రాజకీయ నాయకులకు పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శనీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి అన్నారు. దివంగత కమ్యూనిస్ట్ నేత, స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుందరయ్య వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రం సూర్యాపేటలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగార్జున్‌రెడ్డి మాట్లాడుతూ సుందరయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై నిబద్ధతతో పని చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళులర్పించారు.

'అమరుల ఆశయ సాధనకు ముందుకు సాగాలి'

బహిరంగ సభలో అభివాదం చేస్తున్న విమలక్క, నాయకులు

ఆత్మకూర్.ఎస్, మే 19: అమరుల ఆశయ సాధనకు ముందుకు సాగుతూ ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు విమలక్క పిలుపునిచ్చారు. మండల పరిధిలోని రామన్నగూడెం గ్రామంలో ఆదివారం రాత్రి నిర్వహించిన రైతు కూలీ సంఘం నాయకులు ఆరుట్ల వెంకటరెడ్డి, ఆరుట్ల శంకర్‌రెడ్డి స్మారక స్థూపాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో విమలక్క మాట్లాడుతూ ఆరుట్ల వెంకటరెడ్డి, శంకర్‌రెడ్డి చిన్న వయస్సులోనే కమ్యూనిస్ట్ భావజాలంతో గ్రామాల్లో భూస్వాముల దౌర్జన్యాలు, అరాచకాలు, దోపిడీని అరికట్టడంలో క్రియాశీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ప్రజా పోరాటాలను మరింత తీవ్రతరం చేయడమే అమరులకు మనం అర్పించే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది కట్ట భగవంతరెడ్డి, జర్నలిస్ట్ డేగల జనార్దన్, ప్రజా కళాకారుడు ఏపూరి సోమన్న, ప్రొఫెసర్ ఆరుట్ల జానకిరెడ్డి, బొమ్మకంటి కొమరయ్య, పలస యాదగిరి, పల్లెబోయిన జాని, బెల్లి నాగరాజు, పోతుల రమేశ్, రాకేశ్, నాగగాని కృష్ణ, జుజ్జురి సత్యం, రాచకొండ మల్లయ్య, ఉపేంద్రక్క, మల్లారెడ్డి, పల్లె లింగయ్య, పూజ, అరుంధతి పాల్గొన్నారు.

'మండల కేంద్రం మీదుగా బస్సులు నడిపించాలి'

వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఆత్మకూర్.ఎస్, మే 19: సూర్యాపేట డిపో నుంచి ఖమ్మం వెళ్లే బస్సులను మండల కేంద్రం ఆత్మకూర్.ఎస్ మీదుగా నడిపించాలని కోరుతూ పలువురు గ్రామస్తులు సోమవారం డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా మండల కేంద్రానికి బస్సు సర్వీస్‌లు పెంచాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మకూర్.ఎస్ మండల ప్రజలు పత్తి, మిర్చి విక్రయాలతో పాటు వైద్య సదుపాయాల కోసం నిత్యం ఖమ్మం వెళ్తుంటారని, మండల కేంద్రం మీదుగా బస్సు సర్వీస్‌లు నడిపితే వారికి ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే అధికారులు, ప్రజలు రోజూ ఆటోలను ఆశ్రయించి రావాల్సి వస్తుందన్నారు. వెంటనే బస్సు సౌకర్య కల్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో కసగాని బ్రహ్మం, డేగల వెంకటకృష్ణ, జలగం మల్లేశ్, పందిరి మాధవరెడ్డి ఉన్నారు.

ఉపాధ్యాయుల పెండింగ్ డీఏ చెల్లించాలి

● టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రవి

కంప్యూటర్‌ను బహూకరిస్తున్న వెంకన్న కుటుంబ సభ్యులు

సూర్యాపేట అర్బన్, మే 19: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు తక్షణమే పెండింగ్ డీఏ చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి డిమాండ్ చేశారు. సూర్యాపేటలోని ఆ సంఘం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను చెల్లించాలని అన్నారు. అదేవిధంగా వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టి పూర్తి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆ సంఘం పూర్వ జిల్లా కార్యదర్శి మైలారపు వెంకన్న జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు వనజ, భాస్కర్ కలిసి టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యాలయానికి కంప్యూటర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్, యాకయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, అరుణ భారతి, రమేశ్, జ్యోతి, శ్రీను, అభినవ్, నాగయ్య పాల్గొన్నారు.

సూర్యాపేట డీఎస్పీగా ప్రసన్నకుమార్

సూర్యాపేట టౌన్, మే 19: సూర్యాపేట డీఎస్పీగా వి.ప్రసన్నకుమార్ నియమితులయ్యారు. సైబరాబాద్ ఏసీపీగా పని చేస్తున్న ప్రసన్నకుమార్‌ను సాధారణ బదిలీల్లో భాగంగా సూర్యాపేట డీఎస్పీగా బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి సోమవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూర్యాపేట టౌన్, మే 19: సూర్యాపేట మున్సిపాలిటీ పరిధి శాంతినగర్‌లోని 132 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సూర్యాపేట టౌన్-2 పరిధిలో మంగళవారం ఉదయం 6 గంటల నుంచి 9 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ ఎల్.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మునగాల తాసీల్దార్ బదిలీ

మునగాల, మే 19: మునగాల తాసీల్దార్ ఆంజనేయులు యాదాద్రి భువనగిరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన విధుల నుంచి రిలీవ్ అయ్యారు. మునగాల ఇన్‌చార్జి తాసీల్దార్‌గా డిప్యూటీ తాసీల్దార్ సత్యనారాయణకు అధికారులు బాధ్యతలు అప్పగించారు.

గీత కార్మికుడు మృతి

హుజూర్‌నగర్, మే 19: తాటిచెట్టు పైనుంచి పడి హుజూర్‌నగర్ పట్టణ పరిధిలోని తిలక్ నగర్‌కు చెందిన గీత కార్మికుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిలక్‌నగర్‌కు చెందిన నర్సింగ్ ధనమూర్తి (49) సోమవారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడ్డాడు. దీంతో ధనమూర్తి అక్కడికక్కడే మృతిచెందాడు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

హుజూర్‌నగర్ రూరల్, మే 19: వడదెబ్బతో మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి పొదిల నగేశ్ (40) మృతిచెందాడు. వడదెబ్బతో గత రెండు రోజులుగా తీవ్ర అస్వస్థతకు గురవుతున్న నగేశ్ సోమవారం ఉదయం హఠాత్తుగా కింద పడిపోవడంతో కుటుంబ సభ్యులు హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వైద్యుల సలహా మేరకు సూర్యాపేట ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మరణించాడు.

మట్టి అక్రమ తవ్వకాలు ఆపాలి

బీబీనగర్, మే 19 : మండలంలోని రాఘవాపురంలో మట్టి అక్రమ తవ్వకాలు ఆపాలని గ్రామవాసి అంకోజు సుగ్రీవాచారి కోరారు. మట్టి తవ్వకాలు జరుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తాసీల్దార్ భగత్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 554, 555, 538 సర్వే నంబర్ల నుంచి గుట్టుచప్పుడు కాకుండా మూడు రోజులుగా మట్టిని తరలిస్తున్నారని, బాధ్యులు చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతులు వరి కొయ్యలను కాల్చొద్దు

● మండల వ్యవసాయాధికారి అనీసారూహి

మండల కేంద్రంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయాధికారి అనీసారూహి

మద్దిరాల, మే 19: రైతులు పంట పొలాల్లో వరి కొయ్యలను కాల్చొద్దని మండల వ్యవసాయాధికారి అనీసారూహి తెలిపారు. వరి కొయ్యలను కాల్చితే నేలకు, పర్యావరణానికి హానీ కలుగుతుందని, భూసారం తగ్గుతుందని వెల్లడించారు.ఈ మేరకు మండల కేంద్రంలో సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి కొయ్యలను కాల్చితే పంటకు ఉపయోగపడే సూక్ష్మజీవులు, రైతు మిత్ర పురుగులు నశిస్తాయని తెలిపారు. వరి కొయ్యలను కాల్చకుండా పొలంలో కలియదున్నితే సేంద్రియ కర్బన శాతం పెరిగి దిగుబడులు ఐదు నుంచి పది శాతం అధికంగా వస్తాయని తెలిపారు. పొలంలో కలియదున్నగానే 50 కిలోల సూపర్ పాస్ఫేట్ చల్లడం ద్వారా కొయ్యలు తొందరగా కుళ్లి సేంద్రియ పదార్థంగా మారుతుందని వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ అనూష, రైతులు వడ్డాణం మధుసూదన్, భాస్కర్‌రెడ్డి, రవీందర్, సోమలింగం, సురేశ్, మల్లారెడ్డి, సంజీవ, వెంకన్న, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

'దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి'

నూతనకల్, మే 19: కార్మిక, కర్షక, ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు ఉపాధి హామీ పథకం రక్షణ కోసం మంగళవారం చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు లక్ష్మయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కార్మికులు, ప్రజలు సమ్మెలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఉపాధి హామీ పనులకు కేంద్ర బడ్జెట్‌లో రూ.2.50 లక్షల కోట్లు కేటాయించాలని, ఉపాధి కూలీలకు కనీస వేతనం రోజుకు రూ.600 ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వేణు, నర్సయ్య, అవిలయ్య, నాగలింగం, రాజయ్య, సూరయ్య, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాధన చేసి సామర్థ్యం పెంచుకోవాలి

● ఎంఈఓ సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేస్తున్న ఎంఈఓ, మున్సిపల్ కమిషనర్

నేరేడుచర్ల, మే 19: విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరంలో నేర్చుకున్న అంశాలపై సాధన చేసి సామర్థ్యం పెంచుకోవాలని నేరేడుచర్ల ఎంఈఓ సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ యడవెల్లి అశోక్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రం నేరేడుచర్లతో పాటు మండలంలోని పెంచికల్‌దిన్నె జడ్పీహెచ్‌ఎస్‌లలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు అధ్యక్షతన నిర్వహించిన ముగింపు సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. శిబిరంలో క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శనలలో నేర్చుకున్న అంశాలను నిత్యం సాధన చేస్తూ చదువుతో పాటు ఇతర కార్యక్రమాల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో శిక్షకులు యాదగిరి, బాలు, నగేశ్, ఉపాధ్యాయులు సైదులు, నర్సింహారావు, నాగమణి, ఆర్పీలు శ్రీధర్, సత్యనారాయణరెడ్డి, ఆర్.శ్రీనయ్య, వెంకటరెడ్డి, ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గుర్తింపు ఉన్న పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి : ఎంఈఓ

నేరేడుచర్ల, మే 19: గుర్తింపు ఉన్న పాఠశాలల్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని ఎంఈఓ సత్యనారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలలో అడ్మిషన్ పొందే సమయంలో తప్పనిసరిగా పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు ఉన్నదా లేదా అనే విషయాన్ని పరిశీలించాలని, అప్పుడే అడ్మిషన్ తీసుకోవాలని సూచించారు. లేదంటే పిల్లల భవిష్యత్తు ఇబ్బందుల్లో పడుతుందని పేర్కొన్నారు.

వీర జవాన్ మురళీనాయక్‌కు నివాళి

మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

కోదాడ, మే 19: ఆపరేషన్ సిందూర్‌లో వీర మరణం పొందిన జవాన్ మురళీనాయక్ మృతి దేశానికి తీరని లోటని లియాఫీ (లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) అధ్యక్షుడు కంజుల మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని ఎల్ఐసీ భవనంలో ఏజెంట్ల సంఘం నాయకులు, కార్యాలయ ఉద్యోగులతో కలిసి వీర జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన ఎల్ఐసీ మేనేజర్ సుశీల్ నాథనియల్, ఏజెంట్ సంతోశ్ జగదేల్‌తో పాటు మృతిచెందిన వారికి నివాళి అర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మురళీనాయక్ చిన్నతనంలోనే సైన్యంలో చేరి దేశం కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో మల్లేశ్, సోందుమియా, సూర్యనారాయణ, నాగిరెడ్డి, మధుర, వెంకటరెడ్డి, పి.వెంకటాద్రి, సైదా, రమేశ్, సంజీవయ్య, విజయశంకర్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృత్యువాత

నడిగూడెం, మే 19: మండల పరిధిలోని కోడిపుంజులగూడెం గ్రామంలో సోమవారం విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతిచెందాయి. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తీగల యుగంధర్, సైదిరెడ్డికి చెందిన రెండు గేదెలు గ్రామ శివారులో మేత మేస్తూ విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతిచెందాయి. వాటి విలువ సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరారు.

అదుపుతప్పితే అంతే..!

● గుండ్లసింగారం గ్రామ శివారులో పాలేరు వాగుపై శిథిలావస్థకు చేరిన వంతెన
● భయం గుప్పిట్లో ప్రజల రాకపోకలు
● మరమ్మత